సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 24 । మే । 2024



తిరుమలేశునికి పల్లకీ సేవ
విశాఖ: పీలానగర్ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశునికి పల్లకీ ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.



ఘనంగా పంచామృతాభిషేకం
బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. 8లో



ఫ్లైఓవర్‌పై లారీ బోల్తా
ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పై పేపర్ బండిల్స్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన చోటు చేసుకుంది. 8లో

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో శ్రీమన్నారాయణ నామ సంకీర్తన



సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

జి.మాడుగుల: శ్రీమన్నారాయణ వైశాఖ పౌర్ణమి సందర్భంగా మండల కేంద్రమైన జి.మాడుగులలో సంకీర్తన నిర్వహించారు. పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన నామ సంకీర్తన గ్రామ పుర వీధుల్లో సాగింది. ఈ కార్యక్రమంలో సమరత సేవా కమిటీ జిల్లా కన్వీనర్ మత్స్యరాస మత్స్యరాజు, భక్త సంఘ ప్రతినిధులు గబ్బాడి శేఖర్, అడపా బాబూరావు, ఆలయ పూజార్లు కిముడు మత్స్యలింగం, వి శ్రీను, కె.సన్యాసి రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మూడు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

అడ్డతీగల: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చెట్ల కొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో శుక్రవారం అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు యూసఫ్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా ఉండదన్నారు.విద్యుత్ వినియోగదారులు సమస్యను గుర్తించి సహకరించాలని ఆయన కోరారు.

రేపటి నుంచి పవర్ కెనాల్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేపట్టనున్న డొంకరాయి జల విద్యుత్ కేంద్రం వద్ద పవర్ కెనాల్

సీలేరు: డొంకరాయి పవర్ కెనాల్‌కు ఈనెల 25నుంచి మరమ్మతులు చేపడతామని జెన్‌కో అధికారులు తెలిపారు. శనివారం నుంచి ప్రారంభమయ్యే ఈ పనులు వచ్చే నెల 10 వరకు జరుగుతాయని తెలిపారు. ఈ పనులకు అవసరమైన సామగ్రి ఆయా రీచ్‌ల్లో సిద్ధంగా ఉంచాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. పవర్ కెనాల్ మరమ్మతు పనుల సందర్భంగా డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిలిచిపోతుందని వారు వివరించారు. ప్రస్తుతం సీలేరు కాంప్లెక్సు పరిధిలో ఐదు నుంచి 5.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని వారు పేర్కొన్నారు.

సంజీవని నిధికి హెచ్‌పీసీఎల్ ఉద్యోగుల విరాళం

మహారాణిపేట: జిల్లాలోని పేదలు, అనారోగ్య బాధితులకు సాయం చేయాలనే దృక్పథంతో నెలకొల్పిన సంజీవని నిధి–డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు హెచ్‌పీసీఎల్ ఉద్యోగులు రూ.6,45,000 విరాళంగా అందించారు. హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.రతన్ రాజ్ గురువారం కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జునను కలిసి ఈ మొత్తం చెక్కును అందజేశారు. విశాఖ రిఫైనరీలో పని చేస్తున్న ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి సంజీవని నిధికి ఆర్థిక సాయం అందించారని ఈడీ తెలిపారు. ఉద్యోగుల చూపిన చొరవ, దాతృత్వాన్ని కలెక్టర్ ప్రశంసించారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే నౌపడ, పర్లాకిమిడి యార్డ్, పూండి–నౌపడ స్టేషన్‌ల పరిధిలో జరుగుతున్న వంతెన పునర్నిర్మాణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు, మరికొన్నింటిని రీ షెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. విశాఖపట్నం–గుణుపూర్–విశాఖపట్నం (08522/08521) పాసింజర్ స్పెషల్స్ ఈ నెల 24, 27వ తేదీల్లోను, పలాస–విశాఖపట్నం–విశాఖపట్నం(07471/07470) పాసింజర్ స్పెషల్స్ ఈ నెల 27వ తేదీన రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్

- ఈ నెల 27వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం–బ్రహ్మపూర్ (18526) ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 27వ తేదీన ఉదయం 4.30 గంటలకు బయల్దేరాల్సిన సికింద్రాబాద్ –షాలిమర్ (07225) సమ్మర్ స్పెషల్ గంట ఆలస్యంగా 5.30 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 26వ తేదీన రాత్రి 11.40 గంటలకు బయల్దేరాల్సిన సికింద్రాబాద్ –సంత్రగచ్చి (07234) సమ్మర్ స్పెషల్ సుమారు 3 గంటలు ఆలస్యంగా 27వ తేదీ తెల్లవారు 2.4గంటలకు బయల్దేరుతుంది.

అటవీశాఖ కరుణిస్తే.. అంధకారం తొలగినట్టే!

ఇప్పటివరకు అంధకారంలో ఉన్న వలస ఆదివాసీ పల్లెల్లో విద్యుత్ వెలుగులు విరజిమ్మనున్నాయి. కనీసం సెల్‌ఫోన్ కూడా చార్జింగ్ పెట్టుకునే అవకాశం లేని ఆ గ్రామాలకు మంచి రోజులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం జన్‌మన్ పథకంలో ఇప్పటికే కొన్ని గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించిన అధికారులు..రిజర్వ్ ఫారెస్టులో ఉన్న మిగిలిన గ్రామాలకు అటవీశాఖ నుంచి అనుమతులు వచ్చిన వెంటనే కనెక్షన్లు ఇచ్చేందుకు మెటీరియల్ సిద్ధం చేశారు.

- రిజర్వ్ ఫారెస్ట్ కారణంగా ముందుకు సాగని విద్యుదీకరణ పనులు
- అనుమతుల కోసం నివేదించిన విద్యుత్‌శాఖ
- విద్యుత్ లైన్ల పనులు చేపట్టేందుకు సిద్ధంగా మెటీరియల్
- ఆశగా ఎదురు చూస్తున్న వలస ఆదివాసీలు



విద్యుత్ సౌకర్యం కల్పించనున్న చింతలపాడు



విద్యుదీకరణకు పాలమడుగు వద్ద సిద్ధంగా ఉంచిన స్తంభాలను చూపిస్తున్న ఆదివాసీలు

ఎటపాక: ఆదివాసీ పల్లెల్లో విద్యుత్ వెలుగులు నింపేందుకు ప్రభుత్వాల కృషి సత్ఫలితాలిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. రిజర్వు ఫారెస్టు పరిధిలో ఉన్న గ్రామాలకు విద్యుత్ కనెక్షన్ల మంజూరులో జాప్యం జరగడం వల్ల ఆదివాసీలకు అవస్థలు తప్పడం లేదు. అటవీశాఖ అడ్డంకుల వల్ల ఈ సమస్య ఎదురైంది.

గిరి శిఖరాల్లో..

జిల్లాలోని నాలుగు విలీన మండలాల్లో ఆదివాసీ గ్రామాలకు పూర్తిస్థాయిలో నేటికి విద్యుత్ సౌకర్యం లేదు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి దశాబ్దాల క్రితమే ఆదివాసీలు ఈ ప్రాంతాలకు వచ్చి గిరి శిఖర ప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. అప్పటినుంచి చిమ్మచీకట్లోనే మగ్గుతున్నారు.

ఎటపాక మండలంలో..

లక్ష్మీపురం,విస్సాపురం,మురుమూరు,రామగోపాలపురం గ్రామ పంచాయతీల పరిధిలోని 63 నివాసిత ప్రాంతాల్లో 533 కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్‌మన్) పథకంలో విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. అయితే వీటిలో విద్యుత్ లైన్ల సమస్య లేనిచోట 150 కనెక్షన్లు ఈమధ్యకాలంలో ఇచ్చారు. మిగిలిన రిజర్వ్ ఫారెస్ట్‌లోని సుమారు పది వలస ఆదివాసీ గ్రామాల్లో సుమారు 383 కుటుంబాలు విద్యుత్ కనెక్షన్ల ఇవ్వాల్సి ఉంది. వీరంతా విద్యుత్ కనెక్షన్ల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వారికి విద్యుత్ లైన్లు ఏర్పాటుచేసి కనెక్షన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఆయా గ్రామాలన్నీ రిజర్వ్ ఫారెస్టులో ఉన్నందున పరిపాలన, సాంకేతిక అనుమతులు రావాల్సి ఉంది. ఈమేరకు అవసరమైన నివేదికలను చింతూరు ఐటీడీఏ, కలెక్టర్, చింతూరు డీఎఫ్‌వోకు నివేదించామని నెల్లిపాక రేంజర్ మూర్తి తెలిపారు. త్వరలో అనుమతులు వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. విద్యుత్ స్తంభాలు, కండక్టర్లు ఇప్పటికే విద్యుత్ శాఖ అధికారులు అందుబాటులో ఉంచారు.

మూన్నాళ్ల ముచ్చటగా..

గొల్లగుప్ప, చింతలపాడు, దొరమెట్ల, కామంతోగు, జగ్గవరం గ్రామాల్లో నాలుగేళ్ల క్రితం విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు సోలార్ యూనిట్లు ఏర్పాటు చేశారు. నిర్వహణ లోపం వల్ల వాటి ప్రయోజనం మూన్నాళ్ల ముచ్చటగా మారింది. వీటిని వినియోగంలోకి తెస్తే కొంతవరకైనా సమస్యల పరిష్కారం అవుతుందని ఆయా ప్రాంతాల వలస ఆదివాసీల ఆశిస్తున్నారు.

విలీన మండలాలు మూడింటిలో..

- చింతూరు మండలంలో 12 నివాసిత ప్రాంతాల్లో 124 సర్వీసులు, కూనవరం, వీఆర్ పురం మండలాల్లో 17 నివాసిత ప్రాంతాల్లో 208 సర్వీసులు ఏర్పాటు చేశారు.
- చింతూరు, కూనవరం, వీఆర్‌పురం నాన్ పీవీటీజీ గ్రామాల్లో 135 నివాసిత ప్రాంతాల్లోని 1093 మందికి విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. అయితే వీరిలో ఇప్పటివరకు 476 కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు.

ఎన్నో ఇబ్బందులు



ఇరవై ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నాం. ఓటు హక్కు, రేషన్ కార్డు ఉన్నాయి. విద్యుత్ సౌకర్యం లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. ఇన్నాళ్లకు తమ సమస్యను కేంద్ర ప్రభుత్వం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.
– రాంబాబు, మద్దిమడుగు,ఎటపాక మండలం

అటవీశాఖ చొరవ చూపాలి



విద్యుత్ సౌకర్యం లేకపోవడం వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. కనీసం సెల్‌ఫోన్ చార్జింగ్ చేసుకోవాలన్నా సమీప గ్రామాలకు వెళ్లాల్సి వస్తోంది. అటవీశాఖ చొరవ చూపి అనుమతులు మంజూరు చేసి ఆదుకోవాలి.
– కమల, ఎంపీటీసీ, లక్ష్మీపురం

పనిచేయని సోలార్ యూనిట్



గ్రామంలో ఉన్న సోలార్ విద్యుత్ యూనిట్ పనిచేయట్లేదు. ఏర్పాటు చేసిన కొన్ని నెలలకే పాడయింది. విద్యుత్ సౌకర్యం లేక నిత్యం ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నాం. అటవీశాఖ అధికారులు చొరవచూపి పరిష్కరించాలి.
– దేవి, చింతలపాడు, ఎటపాక మండలం

అనుమతి వచ్చిన వెంటనే పనులు

ఎటపాక మండలంలోని వలస ఆదివాసీ గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కలించేందుకు సామగ్రి తీసుకొచ్చాం. రిజర్వ్ ఫారెస్ట్‌లో విద్యుత్ లైన్ల ఏర్పాటుకు అటవీశాఖ అనుమతులు ఇచ్చిన వెంటనే పనులు ప్రారంభించి విద్యుత్ కనెక్షన్లు ఇస్తాం.
– మలాకి, ఏడీఈ, విద్యుత్‌శాఖ, చింతూరు

సజావుగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

డీఆర్వో పద్మావతి



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో పద్మావతి

సాక్షి, పాడేరు: జిల్లాలో ఈనెల 24 శుక్రవారం నుంచి జరగనున్న ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా నిర్వహించాలని డీఆర్వో పద్మావతి ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై అధికారులతో గురువారం ఆమె సమీక్షించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఇంటర్ ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు సెకండియర్ పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లావ్యాప్తంగా 14,162 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. పాడేరు డివిజన్ పరిధిలోని 42 కళాశాలలకు చెందిన 7,417 మందికి 13 పరీక్ష కేంద్రాలు, రంపచోడవరం డివిజన్ పరిధిలోని 31 కళాశాలలకు చెందిన 6,745 మందికి 8 పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేసినట్టుగా ఆమె తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ఇంటర్ విద్యా ప్రత్యేకాధికారి వినోద్‌బాబు, డీఈవో బ్రహ్మాజీ, డీడీ కొండలరావు, డీటీవో ఎస్.లీలాప్రసాద్, ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్, ఎస్‌ఐ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

పన్ను మోసాలపై విజి‘లెన్స్’

సాక్షి, విశాఖపట్నం : నకిలీ ఇన్‌వాయిస్‌ల పేరుతో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ సొమ్ము దోచుకుంటున్న కంపెనీలపై కేంద్ర, రాష్ట్ర పన్నుల శాఖల పరిధిలోని విజిలెన్స్ అధికారులు దృష్టిసారించారు. ‘పన్ను మోసం.. చెరో సగం’ శీర్షికన ‘సాక్షి’లో గురువారం కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు. గత ఏడాదిన్నర కాలంలో వచ్చిన ఇన్‌వాయిస్‌ల డేటా సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. అదేవిధంగా వరుసగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందుతున్న సంస్థల వివరాలు పరిశీలిస్తున్నారు. ఏఏ సంస్థలు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ సొంతం చేసుకున్నాయి.. ఆ సంస్థల అడ్రస్‌లు ఏంటి.. ఏఏ ఇన్‌వాయిస్‌లను సబ్మిట్ చేసి.. క్రెడిట్స్ పొందాయి.. ఇలా విభిన్న కోణాల్లో విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

పకడ్బందీగా.. పారదర్శకంగా..

- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ సునీత



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి విజయ సునీత, ఆర్వోలు భావన వశిష్ట, అభిషేక్

సాక్షి పాడేరు: వచ్చే నెల నాలుగో తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపును పకడ్బందీగా..పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఎం.విజయ సునీత ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం ఆర్‌వోలు, ఏఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాల్‌కు ఈవీఎంలో చేరవేస్తున్న సమయంలో ప్రతీ అంశాన్ని వీడియో తీయించాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారమే ప్రతీ ఒక్కరూ ప్రవర్తించాలన్నారు. కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళ్లను ఎదురెదురుగా ఏర్పాటు చేయాలని, ఒక్కో టేబుల్‌కు ఒక కౌంటింగ్ సహాయకులు, ఒక పర్యవేక్షకుడు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కించాలని సూచించారు. ఉదయం ఐదు గంటలకు రేండమైజేషన్ టేబుల్ కేటాయింపు జరగాలని, కౌంటింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో బారికేడ్లు ఏర్పాటుచేయాలని సూచించారు. పాసులు ఉన్న వారినే మాత్రమే కౌంటింగ్ హాలుకు పంపించాలని, ఈ ప్రాంతంలో మూడంచెల బందోబస్తు ఉంటుందన్నారు. కౌంటింగ్ ఏజెంట్లకు అవసరమైన స్టేషనరీని ఎన్నికల సిబ్బందే అందిస్తారని తెలిపారు. మీడియా వారు కూడ తప్పని సరిగా ఎన్నికల కమిషన్ అందజేసిన పాసులు కలిగి ఉండాలని తెలిపారు. వారు కూడా వీడియో లేదా ఫొటోలను దూరం నుంచి తీసుకోవాలని, కౌంటింగ్ సిబ్బందిని తీయరాదని సూచించారు. వర్చువల్ విధానంలో నిర్వహించిన ఈ సమావేశంలో పాడేరు, అరకు ఆర్వోలు భావన వశిష్ట, అభిషేక్, సహాయ రిటర్నింగ్ అధికారులు డీఆర్వో పద్మావతి, రంపచోడవరం ఆర్వో సబ్ కలెక్టర్ ఎస్ ప్రశాంత్ కుమార్, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి అభిషేక్, చిత్రంలో ఏఎస్పీ ధీరజ్



హాజరైన అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు

- అన్ని వర్గాలు సహకరించాలి
- అరకు అసెంబ్లీ అభిషేక్

అరకులోయ రూరల్: ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు జరిగిలే అన్నివర్గాల ప్రజలు, అభ్యర్థులు సహకరించాలని అరకు అసెంబ్లీ ఆర్వో అభిషేక్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వివిధ పార్టీల అభ్యర్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంల ద్వారా ఓట్ల లెక్కింపు పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఇందుకు అభ్యర్థులు సహకరించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు రోజున జిల్లా కేంద్రం పాడేరులో ప్రత్యేక పోలీస్ నిఘా ఉంటుందని పాడేరు ఏఎస్పీ ధీరజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో భాగంగా అమలులో ఉన్న 144 సెక్షన్ కొనసాగుతుందన్నారు. పోలింగ్ పక్రియను అన్ని వర్గాల ప్రజలు, అధికారులు, సిబ్బంది సహకారంతో జిల్లాలో ఎంతో విజయవంతం చేశామన్నారు. లెక్కింపు పక్రియను అదేవిధంగా విజయవంతం చేయాలని కోరారు. కౌంటింగ్ ప్రక్రియ జరిగే ప్రాంతాలకు పరిసరాల్లో సీసీ కెమెరాలు, సీఆర్‌పీఎఫ్ బలగాలతో భద్రత ఉంటుందన్నారు. ఏజెంట్లు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని.. లేకుంటే అనుమతించమన్నారు. లెక్కింపు కేంద్రానికి వంద మీటర్ల దూరం నుంచి నడుచుకుని రావాలని సూచించారు. ఎస్‌డీసీ వీవీఎస్ శర్మ, తహసీల్దార్లు సోమేశ్వరరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అద్భుతంగా మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం

- పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి
- కుటుంబ సమేతంగా ప్రాజెక్ట్ సందర్శన



వించ్ వద్ద ఫొటో దిగుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర కుటుంబ సభ్యులు



బొండా జాతి గిరిజనులతో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర తదితరులు

ముంచంగిపుట్టు: ఆంధ్రా ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్ర నిర్వహణ అద్భుతంగా ఉందని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్రతో కలిసి కుటుంబ సమేతంగా గురువారం మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. వించ్‌లో ప్రయాణించారు.

మాచ్‌ఖండ్ విద్యుత్ కేంద్రంలో జనరేటర్ల సామర్థ్యం, విద్యుత్ ఉత్పత్తి తదితర వివరాలను తెలుసుకున్నారు.అనంతరం డుడుమ జలపాతం సందర్శించారు. వ్యూపాయింట్ వద్ద ఫొటోలు దిగారు. ఒనకఢిల్లీ వారపు సంతలో బొండ జాతి గిరిజనులతో ఫొటోలు దిగారు. డుడుమ జలాశయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అప్పటిలో విద్యుత్ కేంద్రం నిర్మాణానికి ఉపయోగించిన వించ్‌లో ప్రయాణం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రెండు వేల అడుగుల లోయలో ప్రయాణించే వించ్ టెక్నాలజి నాటి ఇంజినీర్ల ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం నిర్మాణం, నిర్వహణ చాలా బాగుందని, జలవిద్యుత్ కేంద్రాలకు డుడుమ, జోలాపుట్టు జలాశయాలకు నీరందించే మత్స్యగెడ్డ ప్రధాన ఆధారమన్నారు. ఈ పర్యటనలో జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ అరబీరు జగబంధు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పద్మారావు, సుజనకోట ఎంపీటీసీ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

కిక్కిరిసిన వరాహ పుష్కరిణి

- వైశాఖ పౌర్ణమికి పోటెత్తిన భక్తులు
- తరలివచ్చిన గరిడి బృందాలు



భక్తులతో కిక్కిరిసిన వరాహ పుష్కరిణి ప్రాంగణం

సింహాచలం : వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం సింహగిరికి భక్తులు పోటెత్తారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఇలవేల్పుగా కొలిచే ఉత్తరాంధ్ర జిల్లాల్లోని మత్స్యకారులు, గ్రామీణ ప్రాంతాల భక్తులు, ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము ఒంటి గంట నుంచే కొండదిగువ వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించారు. స్వామివారి ప్రతిరూపాలుగా వెంట తీసుకొచ్చిన కోలలకు పూజలు నిర్వహించారు. వంటలు వండుకుని సహపంక్తి భోజనాలు చేశారు. మెట్ల మార్గం ద్వారా సింహగిరికి నడిచి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. గరిడి వాయిద్యాలతో స్వామిని కీర్తించారు. స్నానమాచరించేందుకు వేలాదిగా తరలివచ్చిన భక్తులతో వరాహ పుష్కరిణి కిక్కిరిసింది. వంటలు వండుకుని, సహపంక్తి భోజనాలు చేసే భక్తులతో అడవివరం ప్రాంతంలోని సంత ప్రాంగణం, ప్రియాగార్డెన్స్, హవేళి ప్రాంగణం, పాత అడవివరంలోని మామిడి తోటలు నిండుకున్నాయి. మార్కెట్ కూడలి నుంచి వరాహ పుష్కరిణికి వెళ్లే మార్గం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు భక్తులతో కిక్కిరిసింది. పుష్కరిణి వద్ద దేవస్థానం గార్డులు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దర్శనానికి వచ్చిన భక్తులతో సింహగిరి మెట్లమార్గం, సింహగిరిపై ఉన్న క్యూలు కిక్కిరిశాయి. ప్రసాద విక్రయశాల రద్దీగా మారింది. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



గరిడి బృందాలతో తరలివచ్చి కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు



వరాహ పుష్కరిణిలో స్నానమాచరిస్తున్న భక్తులు

పోలీసుల అదుపులో ఒడిశా వేటగాళ్లు



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

గూడెంకొత్తవీధి: స్థానిక పోలీసులు ఒడిశాకు చెందిన 13 మంది వేటగాళ్లను గురువారం సాయంత్రం అదుపులోనికి తీసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ అప్పలసూరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అటవీ శాఖ అందించిన ముందస్తు సమాచారం ప్రకారం పోలీసులు మండల కేంద్రంలోని పోస్టాఫీసు సమీపంలో ఏడు బైక్‌లపై వెళ్తున్న ఒడిశా వేటగాళ్లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఐదు ద్విచక్రవాహనాలు, 7 సెల్‌ఫోన్‌లతో సుమారు 300 కిలోల వన్యప్రాణుల మాంసం స్వాధీనం చేసుకున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

ఆవకాయకు ధరల ఘాటు

- దిగుబడి తగ్గిన మామిడికాయలు
- పెరిగిన దినుసుల ధరలు



తయారు చేసిన ఆవకాయ



ఆవకాయలో ఉపయోగించే మామిడి కాయలు

నక్కపల్లి: ఆవకాయ పెట్టాలంటే అంత ఆషామాషీగా అనిపించడం లేదు. తగ్గిన మామిడి దిగుబడి, పెరిగిన దినుసులు ధరలతో ఆవకాయ వాసనలు అక్కడక్కడ మాత్రమే కనిపిస్తున్నాయి. ఆవకాయ పచ్చడితో ఆంధ్రులకు మంచి అనుబంధం ఉంది. ముద్ద పప్పు, ఆవకాయతో ఒక్కసారైనా భోజనం చేయాల్సిందే. వేసవి కాలంలో ఆవకాయ తయారు చేయడం అనాదిగా వస్తున్న ఆచారం. ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఆవకాయ పచ్చడి తయారు చేస్తారు. సరుకుల ధరలు ఆకాశాన్నంటడంతో ఈ ఏడాది ఆవకాయ తయారు చేయడం అంత సులభంగా కన్పించడం లేదు.

ఘాటెక్కిన ధరలు

ఏడాది పాటు ఆవకాయ నిల్వ ఉండేందుకు నంబర్ వన్ రకం సరుకులు వాడాల్సిందే. అయితే గత ఏడాదితో పోలిస్తే మామిడి కాయలు, వేరుశనగ నూనె, వెల్లుల్లి, ఆవాలు, మిరపకాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. 50 మామిడి కాయలను ఉపయోగించి ఆవకాయ పెట్టాలంటే సుమారు రూ.1200 వరకు ఖర్చవుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ మిరపకాయల ధర రూ.180 నుంచి రూ.200 వరకు ఉంది. నంబర్ వన్ రకం వేరుశనగ నూనె రూ.190 నుంచి రూ.230 వరకు ఉంది. ఆవాలు రూ.80 నుంచి రూ.100, వెల్లుల్లి కిలో రూ.200 వరకు ఉన్నాయి. ఆవకాయకు ఉపయోగించే మామిడి కాయలయితే వందకాయలు రూ.500 వరకు చెల్లించాల్సి వస్తోంది.

నాణ్యమైన రకాలేవీ...!

వర్షాభావ పరిస్థితుల కారణంగా దిగుబడి బాగా తగ్గిపోయింది. దీనికితోడు తెగుళ్లు కూడా బాగా సోకడంతో నాణ్యమైన మామిడి కాయలు దిగుబడి తగ్గింది. ఆవకాయ కోసం ఎక్కువగా కోలంగోవా, కొత్తపల్లి కొబ్బరి, సువర్ణరేఖ, కలెక్టర్ తదితర రకాల మామిడి కాయలను వినియోగిస్తుంటారు. ఈ ఏడాది కలెక్టర్ మినహా మిగతా రకాల మామిడి కాయల దిగుబడి తగ్గిపోయింది.

తయారీకి వ్యయ ప్రయాసలు

ఏడాది పాటు నిల్వ ఉండే ఆవకాయ కోసం తయారీదారులు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. సరైన సమయంలో లేతపరువుతో ఉన్న కాయలనే ఆవకాయ కోసం వినియోగిస్తుంటారు. టెంక కట్టకపోయినా, మచ్చ ఉన్నా, మెత్తగా ఉన్నా వందలాది రూపాయలు వెచ్చించి తయారు చేసిన ఆవకాయ పాడయ్యే ప్రమాదం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని చాలామంది సొంతంగా ఆవకాయ పెట్టుకునే బదులు సీజనల్ వ్యాపారుల వద్ద సూపర్ మార్కెట్లో లభించే ఆవకాయ డబ్బాలను కొనుగోలు చేసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. పట్టణంలో తోపుడు బళ్లమీద, గ్రామాల్లో అయితే సైకిళ్లు, ఆటోల్లోను తెచ్చి పచ్చళ్లు విక్రయిస్తున్నారు.

తయారీ తగ్గించేశాం

పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల కారణంగా పచ్చళ్ల వ్యాపారం పెద్దగా రాణించడం లేదు. గతంలో తక్కువ ఖర్చులతో నిల్వ ఉండే ఊరగాయలు పెట్టేవాళ్లం. చుట్టుపక్కల వాళ్లు కొనుగోలు చేసేవారు, ఇప్పుడు పెరిగిన దినుసుల ధరల కారణంగా ఊరగాయల ధరలు పెంచాల్సి వస్తోంది. దీంతో కొనుగోళ్లు తగ్గిపోతున్నాయి. దీంతో మేము కూడా ఊరగాయల తయారీ తగ్గించేశాం.

–సుబ్బలక్ష్మి, పచ్చళ్ల వ్యాపారి, పాయకరావుపేట

సొంతంగా తయారు చేస్తేనే రుచి

నిల్వ ఉన్న ఊరగాయలు సొంతంగా పెట్టుకుంటే బాగానే ఉంటుంది, పాడవకుండా ఉంటాయి. కానీ 50 మామిడి కాయలతో ఊరగాయ పెట్టాలంటే వెయ్యి రూపాయలు ఖర్చవుతోంది. తప్పని పరిస్థితుల్లో ఖర్చయినా ఇళ్లల్లో వాడకం కోసం పెట్టక తప్పడం లేదు.

–విశాలాక్షి, గృహిణి

కమనీయం.. కల్యాణోత్సవం



పాలు, పెరుగు, జలాలతో ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేస్తున్న అర్చకులు

- బల్లిగిరిలో ముగిసిన ఉత్సవాలు
- వైభవంగా సహస్ర ఘటాభిషేకం, చక్రస్నానం
- భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి

అల్లిపురం (విశాఖ) : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి తిరు కల్యాణోత్సవాలు గురువారంతో ముగిసాయి. ఈనెల 18వ తేదీన స్వామి వారి తిరు కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఈ నెల 19వ తేదీన స్వామి వారి తిరు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ఉదయం అష్టోత్తర శత కలశస్నపనం, తిరుమంజనసేవ, వసంతోత్సవం, చక్రతీర్థం నిర్వహించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి వీరరాఘవాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ మండపంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కలశాలలో నింపిన పాలు, పెరుగు, గంధం, పసుపు నీటితో శ్రీచక్రంతో పాటు ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, అభిషేకం నిర్వహించారు. ముందుగా పూర్ణాహుతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా స్వామి వారికి భక్తి శ్రద్ధలతో చక్రస్నానం చేశారు. సాయంత్రం ధ్వజావరోహణం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామస్మరణంతో బల్లిగిరి మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ, నక్షత్ర హారతి, సప్త హారతులు నిర్వహించారు.

నేడు పుష్పయాగం..

కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం పుష్పయాగం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయ్ తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి ఊంజల్ సేవ అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పాల్గొని తరించాలని ఆమె కోరారు.



చక్రతీర్థ కార్యక్రమానికి సిద్ధంగా ఉత్సవ విగ్రహాలు



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్ (విశాఖ) : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం



గంగవరం పీహెచ్‌సీలో బీసీజీ వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్న సిబ్బంది



రింతాడలో వ్యాక్సినేషన్‌ను పర్యవేక్షిస్తున్న వైద్యాధికారులు వినయ్‌కుమార్, అచ్యుత్



కుమ్మరిపుట్టులో బీసీజీ టీకాలను వేస్తున్న వైద్యసిబ్బంది

ముంచంగిపుట్టు: క్షయ వ్యాధిలేని సమాజమే లక్ష్యంగా బీసీజీ టీకాలు వేయడం జరుగుతుందని కిలగాడ వైద్యాధికారి రమేష్ అన్నారు. మండలంలో గల సుజనకోట, ఏనుగురాయి పంచాయతీల పరిధిలో పలు గ్రామాల్లో కిలగాడ వైద్య సిబ్బంది బీసీజీ టీకాల కార్యక్రమం నిర్వహించారు. బీసీజీ టీకా యొక్క ఉపయోగంపై గిరిజనులకు అవగాహన కల్పించారు. టీకాలను వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ క్షయ వ్యాధిని నియంత్రంచేందుకు బీసీజీ టీకాను వేస్తున్నామని, క్షయ వ్యాధి రాకుండ ఉండేందుకు ఈ టీకా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి గురువారం బీసీజీ టీకా కార్యక్రమం గ్రామాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు.ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణవేణి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: 2025 నాటికి క్షయ రహిత ప్రాంతంగా అల్లూరి జిల్లా ఉండాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్నామని గూడెంకొత్తవీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ అచ్యుత్‌లు అన్నారు. మండలంలోని రింతాడ సచివాలయం పరిధిలోని అసరాడ గ్రామంలో గురువారం నిర్వహించిన క్షయ నివారణకు సంబంధించిన బీసీజీ టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మధుమేహం ఉన్నవారు సైతం ఈ టీకాను వేసుకోవచ్చన్నారు. ప్రధానంగా 60 ఏళ్ల పైబడిన వారు ఈ టీకాను తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. ఎంపీహెచ్ఈవో నిర్మల, ఆరోగ్య సహాయకులు సత్యనారాయణ, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, కుమారి, ఆశ కార్యకర్తలు రాజేశ్వరి, నాగమణి, దీనకుమారి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

గంగవరం : స్థానిక ప్రాథమక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో 18 సంవత్సరాల నుంచి 66 సంవత్సరాలు ఉన్న వరాఇకి బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం విజయవంతంగా నిర్వహించినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి భావన తెలిపారు. క్షయ (టీబీ) వ్యాధి నివారణకు బీసీజీ టీకాలు వేస్తారన్నారు. అవసరమైన వారందరూ బీసీజీ టీకాలు వేయించుకోవాలన్నారు. గురువారం 10 చోట్ల మొత్తం 452 మంది టీకాలు వేసినట్టు చెప్పారు.

పిడుగుపాటుకు యువకుడికి గాయాలు



గంగవరం చికిత్స పొందుతున్న సాయి

గంగవరం : పిడుగుపాటుకు అడ్డతీగల గ్రామానికి చెందిన సీహెచ్.సాయి(28) అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం సాయంత్రం గోకవరం నుంచి అడ్డతీగల వైపు బైక్‌పై వస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. భారీ వర్షం కురుస్తుండడంతో గంగవరం– పెదగార్లపాడు మధ్యలో గల జువ్వమ్మ కాలువ వద్ద చెట్టు కింద నిలబడగా పిడుగుపాటుకు గురైన యువకుడి దుస్తులు, కాళ్ల బూట్లు కాలిపోయి స్పృహ కోల్పోయి పడి ఉన్న ఆ యువకుడిని అటుగా వెళ్తున్న వారు గమనించి 108కి సమాచారం అందించి, స్థానిక పీహెచ్‌సీకి తరలించగా ప్రాథమిక వైద్య సేవలు అందించారు. మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు.

ఫ్లైఓవర్‌పై లారీ బోల్తా

- ఎన్ఏడీ వద్ద తప్పిన పెను ప్రమాదం
- పేపర్ బండిల్స్‌ను మరో లారీలో తరలించిన ట్రాఫిక్ పోలీసులు



బోల్తాపడిన లారీ

గోపాలపట్నం (విశాఖ): ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పై పేపర్ బండిల్స్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన చోటు చేసుకోవడం, బ్రిడ్జిపైనే లారీ బోల్తా పడటంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ ఘటన జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. కోల్‌కతా నుంచి షీలానగర్‌కు పేపర్ బండిల్స్ లోడుతో వెళ్తున్న లారీ.. ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పైకి రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. లారీలో ఉన్న పేపర్ బండిల్స్ రోడ్డుపై పడిపోయాయి. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 గంటల నుంచి 3 గంటల మధ్య ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో ఇతర వాహనాల రాకపోకలు లేకపోవడం, లారీ కూడా బ్రిడ్జిపైనే బోల్తా పడటంతో ప్రమాద తీవ్రత తగ్గింది. ఈ ప్రమాదంలో క్లీనర్ ఆలీకి స్వల్ప గాయాలయ్యాయి. కంచరపాలెం ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు, ఎస్ఐ బాలరాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బోల్తా పడిన లారీలో ఉన్న 60 బండిల్స్‌ను మరో లారీలోకి క్రేన్ సాయంతో లోడింగ్ చేసి షీలానగర్ తరలించారు. లారీని బ్రిడ్జి పై నుంచి తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. బ్రిడ్జిపైకి ఎక్కి రోటరీలో వెళ్లే సమయంలో డ్రైవర్ నిద్రమత్తు వల్ల లారీని అదుపు చేయలేక బోల్తా పడి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఎయిర్‌పోర్టు పోలీసులు ప్రమాద వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇసుకకొండకు పోటెత్తిన భక్తులు

సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు



రమా సహిత సత్యనారాయణ స్వామి



సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్ (విశాఖ): నగరంలోని ఇసుకకొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. బుద్ధ, వైశాఖ పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువజాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. నగరం నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ కార్యనిర్వాహణాధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్ పర్యవేక్షించారు. సాయంత్రం వరకు భక్తుల తాకిడి కనిపించింది. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు రూ.20, రూ.200, రూ.300 టికెట్లు అందుబాటులో ఉంచారు. వేకువజాము 4 గంటలకు అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం 7 గంటల నుంచి ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. వేసవి తీవ్రత దృష్ట్యా పెండాల్స్ ఏర్పాటు చేశారు.

తిమ్మాపురంలో విజయ్ దేవరకొండ సందడి



ర్యాంప్‌పై విజయ్ దేవరకొండ

కొమ్మాది : భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురంలో ప్రముఖ నటుడు విజయ్ దేవరకొండ సందడి చేశారు. ఆయన నటిస్తున్న ఓ చిత్రానికి సంబంధించిన షూటింగ్ కోసం ఈ నెల 5న నగరానికి చేరుకున్నారు. అప్పటి నుంచి ఆర్కే బీచ్, యారడ బీచ్ వద్ద ఏర్పాటు చేసిన సెట్ల వద్ద సినిమా చిత్రీకరణలో పాల్గొన్నారు. బుధవారం తిమ్మాపురంలో ఓ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫొటో షూట్ కోసం ఇక్కడకు వచ్చారు. అభిమానులతో ఫొటోలు తీసుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ అంటే తనకు ప్రత్యేకమైన ఇష్టమని, ఇక్కడి ప్రకృతి అందాలు, బీచ్ తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. వచ్చేనెల 3 వరకు నగరంలో ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ కొనసాగుతుందని చిత్ర యూనిట్ తెలిపింది.

అప్పన్నకు రెండవ విడత చందనం సమర్పణ

- విశేషంగా స్వామికి పంచకలశ స్నపనం
- చందనంతో దర్శనమిచ్చిన అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి



అప్పన్న ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు

సింహాచలం (విశాఖ) : వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం రెండవ విడత చందన సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. తెల్లవారు జాము రెండు గంటలకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి విశేషంగా పూజలు నిర్వహించారు. మూడు మణుగుల చందనాన్ని స్వామికి సమర్పించారు. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులకు విశేషంగా పంచకలశ స్నపనం నిర్వహించారు. ఆలయ ఆస్థాన మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. గంగా జలాలు, పంచామృతాలతో స్నపనం నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, రమణాచార్యులు, సీతారామాచార్యులు కార్యక్రమాలు నిర్వహించారు.

రూ.4 లక్షల బాణసంచా స్వాధీనం

అక్కిరెడ్డిపాలెం: గాజువాక హైస్కూల్ రోడ్డులోని ఓ ఇంట్లో నిల్వ ఉంచిన బాణసంచాను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకుని.. యజమానిపై కేసు నమోదు చేశారు. వివరాలివీ.. హైస్కూల్ రోడ్డులో గాంధీ అనే వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా రూ.4 లక్షల విలువగల బాణసంచాను ఇంట్లో నిల్వ ఉంచాడు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో.. ఇంటిపై దాడి చేసి బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. గాంధీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.